# మున్నీబేగం

ఎన్నెస్ ఖలందర్

**సౌదీనుంచి ఎగిరిన విమానం బొంబాయిలో దిగింది. బొంబాయిలో దిగగానే, రఫీ సామాన్యంగా దిగే నమ్మకమైన ఆంధ్ర గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నాడు. అతన్ని చూడగానే హోటల్ యజమాని కరీంభాయ్ పలకరింపుగా నవ్వాడు.**

**"బాగున్నావా రఫీభాయ్! నేరుగా ఇక్కడికేనా రావడం? ఏమిటీ విశేషాలూ!" అడిగాడు.**



"ఏముంటాయ్ భాయ్ విశేషాలూ, భూమి గుండ్రంగా వుంది. మనం చంద్రమండలానికెళ్లినా, సౌదీకెళ్లినా మళ్లీ మన గూటికి మనం చేరుకోవాల్సిందేగా. ఇదిగో ఇలా మళ్లీ ఇంటికి బయలుదేరాను" అని చమత్కారంగా చెప్పి, "ఈ వస్తువులన్నీ భద్రంగా పెట్టు భాయ్" అని, పార్సిల్స్‌గా కట్టిన పెట్టెలు, పెద్ద సూటుకేసు ఒకటి టేబుల్ మీద పెడుతూ చెప్పాడు రఫీ.

ఓ చిన్నపాటి రఫ్ పేజీలో రఫీ తెచ్చిన వస్తువుల వివరాలన్నీ రాయించుకొని, రఫీచేత సంతకం కూడా చేయించుకొని, ఆ వస్తువులన్నింటినీ భద్రంగా పెట్టుకున్నాడు కరీంభాయ్. కరీంభాయ్ నమ్మకానికి మారుపేరనీ ప్రతీతి. అందువల్లనే అతని గెస్ట్‌హౌస్ ఎప్పుడూ అరబ్ దేశాలకు వెళ్ళేవాళ్లతోనూ, అరబ్ దేశాలనుంచి వచ్చేవాళ్ళతోనూ కిక్కిరిసి వుంటుందెప్పుడు. నవ్వుతూ పలకరించడమూ, మనిషిమనిషీ పేరు గుర్తుపెట్టుకోవడమూ అతనికి అలవాటు.

రఫీ ఎప్పటిలాగే ఈసారికూడా ఓ సోనీ కలర్ టీ.వీ, ఒక నేషనల్ వి.సి.ఆర్, ప్యానాసోనిక్ టు ఇన్ వన్ వెంట తీసుకొనివచ్చాడు. కలర్‌టివి వాళ్ల అక్క ఆర్డరు. పెద్ద అక్కకు కానుక తీసుకువచ్చి చిన్న అక్కకు తీసుకురాకపోతే అది పెద్ద గొడవే కావచ్చుకూడా! అందుకే చిన్నక్క కోసం విసిఆర్ తీసుకున్నాడు. చెల్లెలి కోసమనీ టు ఇన్ వన్ టేప్‌రికార్డర్, భార్య మున్నీబేగం కోసం మాత్రం కొన్ని బట్టలు తీసుకున్నాడు. ఇక బంధుమిత్రులకు కానుకల కోసమనీ వాచీలు, పెన్నులు, బట్టలు సరేసరి! ఎప్పుడూ లేనిది ఈ మూడేళ్లల్లో అతను బాగానే సంపాదించుకున్నాడు. అందువల్లే ఈసారి ఎక్కువ వస్తువులు కొన్నాడు. మామూలుగా అయితే రెండేళ్లకే వచ్చేసేవాడతను. ఇంకా పెళ్లికాని చెల్లెలి పెళ్లిచేసే బాధ్యత వుండడంతో తండ్రి కోరిక మేరకు ఇంకో యేడాది ఆగాడు. చెల్లెలి పెళ్లికోసం ఈసారి బంగారం కూడా వెంట తెచ్చుకున్నాడు. సౌదీలో అతను చేసేపని కూడా బంగారుపనే కావడంతో తరుగుగా మిగిలిన బంగారాన్నంతా కూడబెట్టుకుంటూ వచ్చాడు. విమానం దిగీదిగగానే ఎప్పుడూలేనిదీసారి కష్టమ్ ఆఫీసర్లతో గొడవ పెట్టుకోవలసి వచ్చింది. లంచమిచ్చీ అక్కడ్నించి తప్పించుకోవాల్సివచ్చిందతనికి. ఇక ఆ తర్వాత ఆ లగేజీకి టాక్సీ వాళ్లతో గొడవ మరొకటి! మనసు మూల దొంగల భయం ఒకటి! ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకొని వస్తువులన్నింటినీ జాగ్రత్తగానే కరీంభాయ్, కరీంభాయ్ ఆంధ్ర గెస్ట్‌హౌస్‌కు చేర్చాడతను. ఇప్పుడతని భయమంతా ఆ వస్తువులన్నింటినీ ఇంటికెలా చేర్చడమన్నదే!


రఫీ బొంబాయి నుంచి ఇంటికి ఫోన్ చేయగానే, ఇంట్లోని వాళ్లందరూ ఫోన్ చుట్టూ చుట్టుకుని కుశల ప్రశ్నలు వేయసాగారు. అన్నింటికీ ఓపిగ్గా సమాధానం చెప్పి, లగేజీ దండిగా వుండడంతో తాను ఒంటరిగా వూరికి రావడంలేదనీ, నాన్ననీ ఇంకా ఇద్దర్ని పిలుచుకొని బొంబాయివస్తే అందరం కలిసి ప్రొద్దుటూరు చేరుకుంటామనీ వాళ్లకర్థమయ్యేలా చెప్పి ఫోన్ పెట్టేశాడతను. ఫోన్‌లో మాట్లాడినంతసేపూ పేరుపేరునా ఇంట్లో వాళ్లనందర్నీ పరామర్శించాడుగానీ, భార్య మున్నీబేగం ఎలావుందనీ అతను ఒక్క మాట కూడా అడగలేదు. మున్నీబేగం చేతికి ఫోన్ ఇచ్చి భర్తతో మాట్లాడాలించాలన్న ఇంగితజ్ఞానం రవ్వంతైనా వాళ్లూ ప్రదర్శించలేదు.

రఫీ పెద్దగా చదువుకోకపోయినా, వచ్చీరాని తెలుగులో ఇంటికి వుత్తరాలు రాసేవాడు. భార్య మున్నీబేగంకు మాత్రం ఒక్క వుత్తరం కూడా రాసేవాడు కాదు. భార్య దొంగతనంగా అప్పుడప్పుడూ వుత్తరాలు రాసినా వాటిక్కూడా బదులు రాసేవాడు కాదు. భర్త తనకు ఉత్తరాలు రాయకపోవడం మున్నీబేగంకు ఆశ్చర్యంగానే వుండింది. సౌదీకెళ్లిన మగవాళ్లందరూ భార్యలకు వుత్తరాలు రాస్తారు. ఈయన మాత్రం విడ్డూరమనీ మనసులో అనుకునేదిగానీ, దాన్ని బయటపెట్టే సాహసం ఆమె ఎప్పుడూ చేయలేదు. భర్త మీద కోపగించుకోవాలన్నా ఆమె ఎలా కోపగించుకుంటుంది? అన్యోన్యత సంగతలా వుంచితే, దేనికైనా అలగడానికీ, గారాలు పోవడానికీ తగినంత చనువు కూడా లేదు వాళ్లిద్దరి మధ్య.

రఫీతో మున్నీబేగం పెళ్లి చాలా హడావిడిగా జరిగిపోయింది. అప్పటికే అతను రెండుసార్లు సౌదీ వెళ్లివచ్చాడు. కొడుక్కి పెళ్లీడు దాటిపోతోందనీ, బట్టతల వచ్చిందనీ తల్లి పోరుపెట్టడంతో ఆ పెళ్లకినా అయ్యిందిగానీ, లేకపోతే అప్పటిక్కూడా అతని పెళ్లి అయ్యేదికాదు.

రఫీ తండ్రి షెహెన్షా మార్కెట్‌లో కూరగాయల వ్యాపారం చేసేవాడు. రఫీ సౌదీ వెళ్లాక తన వ్యాపారం పెద్ద కొడుక్కి అప్పజెప్పి నిశ్చింతగా కాలు మీద కాలు వేసుకొని కాలం గడుపుతున్నాడాయన. వాళ్లది వుమ్మడి కుటుంబం. పెద్దకొడుకు కూరగాయల వ్యాపారం తాలూకు డబ్బులు ఇంటి చిల్లర ఖర్చులకు సరిపోయేవి. అందుకే కుటుంబ భారమంతా సౌదీలో వున్న రఫీమీదే పడింది. అతని సంపాదనతోనే షెహెన్షా ఇద్దరు కూతుర్ల పెళ్లిళ్లూ దర్జాగా చేయగలిగాడు. ఇక మూడవ కూతురి పెళ్లి అయిన తర్వాతే కొడుకు పెళ్ళి చేయాలనుకున్నాడు. కానీ చేయక తప్పిందికాదు. అందువల్లనే పెళ్లికిముందే రఫీచేత కన్నతల్లి పాల మీద ప్రమాణం చేయించుకున్న తర్వాతే పెళ్లి నిశ్చయం చేశాడు. ఇక రఫీ తల్లి బలవంతమ్మీద పెళ్లికానిచ్చాడు. అలా జరిగింది రఫీ, మున్నీబేగం పెళ్లి.

మున్నీబేగం తండ్రి వీరూసాహెబ్ బంగారు వ్యాపారంలో బాగా గడించాడు ఒకప్పుడు. బంగారం వ్యాపారంలో ప్రొద్దుటూరుకు సెకెండ్ బాంబే అని పేరు. అతనిది పెద్ద సంపారం. మున్నీబేగం కంటే ముందు ఇద్దరాడపిల్లల పెళ్లిళ్లూ ఘనంగా చేశాడాయన. పెద్దకూతురి పెళ్లికి అప్పేం కాలేదు. రెండో కూతురి పెళ్లి చేసేటప్పటికి అప్పుచేసే పెళ్లిచేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఆ పెళ్లికయిన అప్పు, ఆ అప్పు తాలూకు వడ్డీ డబ్బులు కడుతూనే ఆయన బంగారం వ్యాపారస్తుని స్థాయినుంచీ కేవలం బంగారు పనోడి స్థాయికి వచ్చాడు. చేతిలో మంచిపని వుండడం చేతే ఆయన ఆమాత్రమైనా మార్కెట్‌లో నిలబడగలిగాడుగానీ, లేకపోతే ఎప్పుడో బిఛానా ఎత్తేయాల్సివచ్చేదే. మూడవ కూతురైన మున్నీబేగం పెళ్లి విషయమే ఆయనకు ఆందోళనగా వుండింది. మున్నీబేగం కంటే ఆఖరి మగపిల్లవాడు కూడా వున్నాడాయనకు. వాడు మగపిల్లోడు. ఎలాగోలా బతికేస్తాడ్లే అన్నదీ ఆయన ధీమా! అందుకోసమే ఆయన వాడికి చదువు కూడా మాన్పించేసీ తన పనిలోనే కూర్చోబెట్టుకుంటున్నాడు. మున్నీబేగం పెళ్లి ఎలా చేయాలి భగవంతుడా అని ఆయన అనుకుంటూ కలవరపడు




తున్న సమయంలో వచ్చింది రఫీతో సంబంధం. రఫీ సౌదీలో డబ్బు బాగా సంపాది స్తున్నాడనీ, అతను సౌదీకెళ్లిన తర్వాతే కొట్టం స్థానంలో ఆర్సీ బిల్డింగ్ లేచిందనీ మధ్యవర్తి చెప్పడంతో ఇంకేమీ ఆలోచించ కుండా పదహైదువేలు కట్నం, పదహైదు తులాల బంగారంతో కూతుర్ని రఫీకిచ్చేందుకు ఒప్పేసుకున్నాడు. ఈసారి కూతురి పెళ్లికి అప్పుచేయదల్చుకోలేదాయన. తరతరాలుగా వారసత్వం కింద వస్తున్న చౌడుమిద్దె అమ్మేసి, పెళ్లిచేశాడు. అలా అప్పుచేయకుండా ఎలాగోలా చిన్న కూతురైన మున్నీబేగం పెళ్లికూడా చేసేసి, గుండెమీద చేయివేసుకొని నిశ్చింతగా పడుకుంటున్నాడాయన.

పెళ్లయ్యాక రఫీ కేవలం నెలరోజులు మాత్రమే మున్నీబేగంతో కాపురం చేశాడు. సౌదీనుంచి వచ్చిన అతని గడువు పూర్తికాగానే అతను విమానంలో ఎగిరిపోయాడు.

ఆ నెలరోజుల్లో భర్తతో ఆమె ఏం కాపురం చేసిందో, ఆమెకే తెలుసు, పైన ఆ భగవంతుడికే తెలుసు!

రఫీ మనస్తత్వం చాలా విచిత్రమైంది. భార్య వుండేదే పక్కలో పడుకోవడానికన్నట్లుండేదతని వ్యవహారం. అయితే భార్యతో మనస్ఫూర్తిగా మాట్లాడ్డానికి మాత్రం చాలా సంకోచించేవాడు. ఆశ్చర్యపోవడమే ఆమె వంతయ్యేది.

భర్త ఏంచెప్పినా, ఏంచేసినా అతని కాళ్లదగ్గరే పడుండాలనీ, గుట్టుగా సంసారం చేసుకోవాలనీ, నా కోసమే ఇల్లు అమ్ముకోవాల్సి వచ్చిందనీ తల్లిదండ్రులు చెప్పేమాటలే మంత్రాల్లా ఆమె నోరుని కట్టిపడేశాయి.

రఫీ సౌదీవెళ్లబోతున్న సమయంలో మున్నీబేగం గుండె గాయపడిన పావురం రెక్కల్లా రెపరెపలాడింది. దేశం విడిచివెళుతున్నప్పుడైనా తనే ధైర్యం చేసి భర్తతో నాలుగు మాటలు మాట్లాడాలని అనుకుంది. అందుకోసం ఎంతగానో ఎదురుచూసింది. అయితే ఆ అవకాశమే రానివ్వలేదతను. స్నేహితులు, బంధువులు సౌదీలో వుండే తమ వాళ్లకోసం తెచ్చిచ్చిన వస్తువుల్నీ, వుత్తరాల్నీ, తన బట్టల్నీ ప్యాక్‌చేసుకుంటూ, స్నేహితులందరికీ ఫోన్‌లో ఖుదాహాఫీస్‌లు చెబుతూ వుండిపోయాడతను. ఇక మిగిలిన సమయమంతా తల్లీచెల్లెల ఏడ్పులూ, ఓదార్పులతోటే సరిపోయింది. మున్నీబేగం గొంతు బాధను దిగమింగీ, దిగమింగీ మూగబోయింది.

రఫీ తీరా వెళ్లబోతూ, భార్య దగ్గర ఆగాడు. భర్త తనని ఒక్కసారి కౌగిట్లోకి తీసుకుంటాడేమోనని ఆత్రంగా ఎదురుచూస్తోందామె. కానీ ఆమె ఆశ అడియాశే అయింది.

"చూడు మున్నీ! నేను లేనని నువ్వే మగాడివైపు కన్నెత్తి చూసినా నేను సహించేది లేదు. నేనొచ్చేంత వరకూ నువ్విక్కడే జాగ్రత్తగా వుండాలి!" అనేసి రఫీ అక్కడ్నించి గబగబా వెళ్లిపోయాడు.

ఆ మాటలు ఆమె గుండెల్లో గునపంలా దిగబడిపోయాయి. అందాక ఆమె దిగమింగుకున్న బాధంతా కన్నీళ్ల ప్రవాహమయ్యింది. ఈ పెళ్లి వ్యవహారమేదో ఓ పట్టాన ఆమెకర్థంకాకుండా పోయింది. పెళ్లిగాకముందు తనెంతమంది రాకుమారుల కలలుగనేది? రఫీ ఫోటో ఆమె చేతికిచ్చి ఇతడే నీ కాబోయే మొగుడని తండ్రి అంటే, ఆమె అతన్నే చివరి రాకుమారుడిలా మనసులో ముద్రించుకుంది. అందమైన కలలు గంది. పెళ్లయ్యాక భర్త ప్రవర్తన తన జీవితంలో ఇంత నిరాసక్తతని నింపుతుందనీ ఆమె వూహించి ఎరుగదు! తనపట్ల ఏమాత్రం బాధ్యతని ప్రదర్శించకుండా వెళ్లిపోతూ చివరగా భర్తన్న ఆ మాటలో ఆమెలో జుగుప్సని కలిగించాయి. ఆ తర్వాత మూడేళ్లు గడిచిపోయాయి. భర్త కేవలం వూహారేఖగా మిగిలిపోయాడామె ఆలోచనల్లో.

ఈ మూడేళ్లల్లో భర్త విరహాన్ని ఆమె ఏమాత్రం అనుభవించేదనడం అతిశయోక్తి కాదు. తనకో భర్త వున్నాడనీ నమ్మడానికి ఆమెకు తగినంత మనోధైర్యం చాలేది కాదు. ఒక్కోసారి ఆమెలో కోరికల వెల్లువ విజృంభించేది. శరీరాన్నెంత ఘోషాలో వుంచినా మనసునెలా ఘోషాలో వుంచాలో ఆమెకర్థమయ్యేదికాదు.

మున్నీబేగం ఖురాన్ చదివింది.



రఫీ తీరా వెళ్లబోతూ, భార్య దగ్గర ఆగాడు. భర్త తనని ఒక్కసారి కౌగిట్లోకి తీసుకుంటాడేమోనని ఆత్రంగా ఎదురుచూస్తోందామె. కానీ ఆమె ఆశ అడియాశే అయింది.

అర్థంతో ఏమాత్రం నిమిత్తం లేకుండా ఖురాన్‌ని పారాయణం చేయడం ఇక్కడి సాధారణ పద్ధతి. పుణ్యమొస్తుందనే యావతప్ప, అర్థంకోసం ఖురాన్‌ని చదివేవాళ్లు చాలా అరుదు. అయితే ఖురాన్ పారాయణంలో ఆమెకు కొద్దోగొప్పో మనశ్శాంతి లభించేది. ఏదో ఒకనాడు అల్లా తన జీవితాన్ని బాగుచేయకపోతాడా అన్నది ఆమె ప్రగాఢ విశ్వాసం!

రఫీ సౌదీ వెళ్లాక తన కూతుర్ని పుట్టింటికి పంపమని మున్నీబేగం తండ్రి పట్టుబట్టాడు. ఆమెని పుట్టింటికి పంపిస్తే ఎక్కడ తన కొడుకు డబ్బులు పంపకుండా భార్యకు పంపించుకుంటాడోనని రఫీ తండ్రి దిగులు. అందుకోసమే అందుకతను సమ్మతించలేదు.

"అమ్మీజాన్! ఇంత ఇల్లు అమ్మీ, కట్నమిచ్చీ నా పెళ్లి చేసి గొంతుకోశారు. దీనికంటే కూడా నాక్కాస్త విషమిచ్చి వున్నా బాగుండేది" అని తల్లిముందు మున్నీబేగం బావురుమనేది. కూతురి బాధ తల్లికర్థమైనంతగా మరింకెవరికర్థమవుతుంది?

మున్నీబేగం భర్త అన్న వహీద్ చపలచిత్తుడు. భర్తలేని మున్నీబేగం మీదే అతనికెప్పుడూ ధ్యాస. మున్నీ అందం ముందు అతని ధైర్యం చాలేదికాదు, పైగా ఎన్ని బాధల్లో, సమస్యల్లో వున్నా ఆమె డాంబికంగా, గంభీరంగా వుండేది. వహీద్ ఎంగిలిచూపుల అర్థాన్ని పోల్చుకోలేనంత అవివేకురాలేంకాదామె. భర్త పోలికలున్న వహీద్ అంటేనే ఆమెకెందువల్లో చిరాకేసేది. ఇప్పుడు అకస్మాత్తుగా భర్త వస్తున్నాడన్న వార్తే ఆమెలో చిత్రమైన కలవరం రేపింది. ఆ వార్త ఆమెలో ఓవిధమైన బెదరునీ, కంగారునీ నింపింది. భర్త రాకుండా వుంటేనే బాగుంటుందని ఆమెకనిపించసాగింది.

రఫీ బొంబాయి నుంచి ఇంటికి క్షేమంగా చేరుకున్నాడు, అన్ని వస్తువులతోటి. క్షేమసమాచారాల తర్వాత అందరి దృష్టి వస్తువుల మీద పడింది. మున్నీబేగం మాత్రం అవేమీ పట్టనట్లుండిపోయింది. భార్య నిరాసక్తని గమనించాడు రఫీ. తనని చూడగానే ఆమె ముందుకొచ్చి తన పాదాలముందు వాలిపోతుందనీ అతననుకున్నాడు. అలా జరగకపోయేటప్పటికి అతనిలో ఒక్కసారిగా అసహనం చోటుచేసుకుంది. భార్య వండుతున్న బిర్యానీ ఘుమఘుమల్ని కూర్చుండిపోయి ఆస్వాదిస్తుండిపోయాడు. బిరియానీ మీదుండేంత శ్రద్ధ అతనికి భార్యపట్ల వుంటే బాగుంటుందేమో?

మున్నీబేగం బిరియానీలో మసాలాలు కలుపుతూ దీర్ఘాలోచనలో పడిపోయింది. ప్చ్! ఏం మనుషులో ఏమో, ఇంటికోడలిని ఓ పనిమనిషిగానో, వంటమనిషిగానో చూస్తారుతప్ప, కోడలి హోదాలో చూడరు. తనే ఒక్కసారిగా తిరగబడితేనో? తిరగబడితే, ఏం జరిగితే అది జరుగుతుంది. అనవసరమైన భయంకంటే కూడా ఎదురవ్వబోయేదాన్ని ఎదుర్కోవడమే ఎంతో శ్రేయస్కరం అనుకుంది మనసులో. తన తిరుగుబాటుకు విలువ లేకుంటే, ఈ బతు కు బతకడం కంటే చావడమే వుత్తమం అనుకుంది.

ఇంకా చీకటి పడకముందే మున్నీబేగాన్ని పెళ్లికూతురిలా ముస్తాబుచేసి కొడుకున్న గదిలోకి పంపించింది అత్త.

"ఏమిటీ అలాగున్నావ్? నేనొచ్చానన్న సంతోషం లేదూ? ఏం వంట్లో ఏమైనా బాగోలేదా?" మెల్లగా ఆమెని మాటల్లో దింపే ప్రయత్నంలో పడ్డాడతను.

ఈ మూడేళ్లలో భర్తలో వచ్చిన మార్పుని గమనిస్తూ వుండిపోయిందామె. ఇందాకటి బిడియం లేదతనిలో. చనువుగా మాట్లాడుతున్నాడు. ఆ మాటల్లోనైనా అతను వెళ్తూవెళ్తూ అన్న మాటలకు రవ్వంతైనా క్షమాపణలు చెబుతాడేమోనని ఎదురుచూసి నిరాశ చెందిందామె. కోడిమాంసం తినీతినీ దున్నపోతులా బలిసి, తలమీది వెంట్రుకలన్నీ వూడిపోయి వికారంగా కనిపిస్తున్న భర్తనే చూస్తుండిపోయిందామె.

అతను నిలువెల్లా కోరికతో వణికిపోతున్నాడు. మునుపటికంటే సన్నగా, బంగారు రంగులో మెరిసిపోతున్న భార్య వంటిసొగసుల్ని కళ్లతోనే ఆస్వాదిస్తున్న అతను, భార్యని తన కౌగిట్లోకి తీసుకోబోతూ, ఆమె కళ్లల్లోకి చూశాడు. వాడిగా వున్న ఆమె చూపులకు తట్టుకోలేక తల దించుకున్నాడు.

"మళ్లీ ఎప్పుడు వెళుతున్నారూ? సౌదీనుంచి ఎన్ని రోజుల సెలవుమీద వచ్చారూ?" ఆమె ప్రశ్నలకు వులిక్కిపడ్డాడతను.

ఆమె మౌనంగా అతని పక్కలోంచి లేచివెళ్లి, మంచం కింద దుప్పటి పరుచుకుంది. ●